రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి
- మిల్లర్ల సమావేశంలో కలెక్టర్ హరిచందన



మిల్లర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

మిర్యాలగూడ: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన మిల్లర్లకు సూచించారు. గురువారం వేములపల్లి మండలం శెట్టిపాలెం శివారులో ఉన్న పద్మశ్రీ రైస్‌మిల్లును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిర్యాలగూడలోని ఆర్డీఓ కార్యాలయంలో రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామన్నారు. ధాన్యం కొనుగోలుకు 370 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత వానాకాలం సీజన్‌కు సంబంధించి మిగిలిన 1,86,144 టన్నుల సీఎంఆర్‌ను 86 రైస్ మిల్లులు ఏప్రిల్ 30లోగా అప్పగించాలన్నారు. రోజువారీగా నిర్దేశించిన ప్రకారం కాకుండా సీఎంఆర్ కేవలం 50శాతం మాత్రమే చెల్లిస్తున్నారని, అలా కాకుండా రోజుకు 4వేల మెట్రిక్ టన్నుల ప్రొక్యూర్‌మెంట్ పెట్టాలన్నారు. ధాన్యం నిల్వకు ప్రభుత్వ గోదాములు ఉచితంగా ఇచ్చే పరిస్థితి లేదని అద్దె చెల్లించాల్సిందేనని మిలర్లకు తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, మార్కెటింగ్ ఏడీ శ్రీకాంత్, అగ్రికల్చర్ ఏడీ నాగమణి, తహసీల్దార్లు హరిబాబు, ప్రమీల, శ్రీనివాస్‌శర్మ, సివిల్ సప్లయ్ డీటీ షేక్ జావిద్, ఆర్ఐ సురేందర్ సింగ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే స్టేషన్‌లో మద్యం పట్టివేత



మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

మిర్యాలగూడ అర్బన్ : అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తుండగా రైల్వే పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌జీ. పికెరెడ్డి, కె.సాలమ్మలు తెలిపిన వివరాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఉన్న సంచులను తనిఖీ చేయగా అందులో అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఆ మద్యాన్ని మిర్యాలగూడ పట్టణం నుంచి నడికుడికి తరలిస్తున్నట్లు గుర్తించామని ఈ తనిఖీల్లో వివిధ బ్రాండ్లకు చెందిన 16ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించామని తెలిపారు. ఈ తనిఖీల్లో రైల్వే కానిస్టేబుళ్లు పి.వెంకన్న, ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ అశ్విన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

కొండమల్లేపల్లి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మండల ఎంపీడీఓ కార్యాలయంలో సాదాసీదాగా సాగింది. సమావేశంలో ఎలాంటి తీర్మానాలు లేకుండానే సర్వసభ్య సమావేశాన్ని ముగించారు. ఎంపీపీ దూదిపాల రేఖరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల నియామవళి అములులో ఉండడంతో సమావేశంలో తీర్మానాలు లేకుండానే ముగించారు. మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ పస్నూరి సరస్వతమ్మ, ఎంపీడీఓ రాంరెడ్డి, ఎంపీటీసీలు, ప్రత్యేక పాలన అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జానారెడ్డి పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

హాలియా : అల్వాల ఎక్స్‌రోడ్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీను నాయక్ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అల్వాల ఎక్స్‌రోడ్డులో నివాసం ఉంటున్న బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు శ్రీను నాయక్ మృతదేహంపై ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపి బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాండునాయక్, నాయకులు వెంకట్‌రెడ్డి ఉన్నారు.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి : ఈనెల 30న హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మట్టంపల్లిలో నిర్వహించే పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని కొండమల్లేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమన్‌రెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలం నుంచి పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే బాలునాయక్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో తరలివెళ్లనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న సభ్యులు

దేవరకొండ : లయన్స్ క్లబ్ ఆఫ్ మిత్ర దేవరకొండ ఆధ్వర్యంలో పట్టణంలోని సంజయ్‌కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లబ్ సభ్యుడు కేవీ ప్రసాద్ సహకారంతో సమకూర్చిన పరీక్ష సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అంకం చంద్రమౌళి, కూరెళ్ల కృష్ణాచారి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుడదన్నారు. ఈ కార్యక్రమంలో మాకం మహేష్, ప్రదీప్, రాములు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

- అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వేలాద్రి ఎన్నిక



జి.రామకృష్ణారెడ్డి అధ్యక్షుడు



సకినాల వేలాద్రి ప్రధాన కార్యదర్శి



వెంకట పవన్‌కుమార్ కోశాధికారి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ప్రశాతంగా ముగిశాయి. పోలింగ్ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జరిగింది. అనంతరం 3:30గంటలకు కౌంటింగ్ ప్రారంభించగా మొత్తం 132 ఓట్లకుగాను 125ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. న్యాయవాదులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి గుర్రం రామకృష్ణారెడ్డి, మహంకాళి రాజేష్‌లు బరిలో ఉండగా, ప్రధాన కార్యదర్శిగా అలుగుబెల్లి రాజ్‌కుమార్, సకినాల వేలాద్రి ఉన్నారు. అదే విధంగా జాయింట్ సెక్రటరీ-2 పదవికి మోదాల మల్లేష్, సీహెచ్‌వీడీ ప్రసాద్‌లు పోటీపడ్డారు. మిగిలిన పదవులకు ఒక్కొక్కరే నామినేషన్ వేయడంతో వారు ఎకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ ఎన్నికల అధికారి ఏచూరి శ్రీనివాస్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి సైదులు తెలిపారు.

కౌంటింగ్ పూర్తి అయ్యేంత వరకు ఉత్కంఠ

2024- 2025 సంవత్సరానికి గాను జరిగిన మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నికల కౌంటింగ్ 3:30కి నుంచి 4:15 గంటల వరకు ఉత్కంఠంగా కొనసాగింది. గెలుపు ఎవరిని వరిస్తుందోనని ఆయా అభ్యర్థులు ఉత్కంఠంగా ఎదురుచూశారు. అయితే ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా పోటీ చేసిన గుర్రం రామకృష్ణారెడ్డికి 83ఓట్లు రాగా మహంకాళీ రాజేష్‌కు 40ఓట్లు వచ్చాయి. అదే విధంగా ప్రధాన కార్యదర్శి పదవికి అలుగుబెల్లి రాజ్‌కుమార్‌కు 59ఓట్లు రాగా సకినాల వేలాద్రికి 62ఓట్లు వస్తే ఎం.శ్రీధర్‌కు 2ఓట్లు మాత్రమే వచ్చాయి. జాయింట్ కార్యదర్శి-2 పదవికి మోదాల మల్లేష్‌కు 97 ఓట్లు రాగా సీహెచ్‌వీడీ ప్రసాద్‌కు 24ఓట్లు వచ్చాయి.

ఎన్నికైన నూతన కార్యవర్గం..

మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గుర్రం రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సకినాల వేలాద్రి, కోశాధికారిగా ముడుసు వెంకట పవన్‌కుమార్, ఉపాధ్యక్షులు-1గా ఎండీ ఇబ్రహీం, ఉపాధ్యక్షులు-2గా పి.స్వామిప్రసాద్, జాయింట్ కార్యదర్శి-1గా కందిమళ్ల వెంకట్‌రెడ్డి, జాయింట్ కార్యదర్శి-2గా మొదాల మల్లేష్, లైబ్రరీ కార్యదర్శిగా ధీరావత్ రవినాయక్, కల్చరల్ అండ్ గేమ్స్ కార్యదర్శిగా బాణాల ఉమాశంకర్, మహిళా ప్రతినిధిగా బి.జ్యోతి, కార్యవర్గ సభ్యులుగా ఆర్.భాస్కర్, గంగాభవానీ, కస్తూరి నాగేందర్, కె.రామకృష్ణ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి నాయక్

మిర్యాలగూడ అర్బన్ : టెట్ దరఖాస్తు ఫీజులు తగ్గించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడావత్ రవినాయక్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటామడిందని, దానికి తగిన మూల్యం చెల్లించదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం యువత డిక్లరేషన్ పేరుతో యువకులను ఆశల మత్తులో ఉంచిందని, ముఖ్యంగా ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరగానే వ్యవహరిస్తుందని విమర్శించారు. తీరుమార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామన్నారు. గతంలో టెట్ ఫీజు రూ.300 ఉండేదని ఇప్పుడు దానిని రూ.వెయ్యి కి పెంచారని రెండు పరీక్షలకు కలిపి 2వేలు అవతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం టెట్ ఫీజును పెంచడంతో నిరుద్యోగులు మరింత ఇబ్బందులు పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు తగ్గించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీలను ఏకం చేసి ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అదే విధంగా టెట్ నిర్వహణ సెంటర్లను 33 జిల్లాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంటన నాయకులు శ్రీను, వినోద్ నాయక్, ఆశీర్వాదం, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

నాగరాజు ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలి

నిడమనూరు: మండలంలోని ఊట్కూర్‌కు చెందిన వ్యాపారి తెరపాటి నాగరాజు ఏడేళ్ల నుంచి కనిపించకుండా పోయాడని, ఎవరికైనా సమాచారం తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ గోపాల్‌రావు గురువారం తెలిపారు. మండలంలోని ఊట్కూర్, నందికొండవారిగూడెం రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తూ ఉంటాడన్నారు. 2017లో 8మంది రైతుల నుంచి రూ.15లక్షల విలువైన 300క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశాడని వివరించారు. పత్తి కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా , కనిపించకుండా పోవడంతో 2017లో రైతులు ఫిర్యాదు చేయగా నాడు కేసు నమోదు అయిందని తెలిపారు. నాటి నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కావడం లేదన్నారు. అతడి ఆచూకీ తెలిసిన వారు నిడమనూరు ఎస్ఐ(8712670195), హాలియా సీఐ (8712670152)కు మిర్యాలగూడ డీఎస్పీకి గానీ తెలయపర్చాలని ఎస్ఐ గోపాల రావు కోరారు.

దైవ భక్తితోనే మానసిక ప్రశాంతత

మిర్యాలగూడ : దైవ భక్తితోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రకాశ్ నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి తన వంతుగా తోడ్పాటునందిస్తానని అన్నారుఫ్తి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 7వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టి బాబునాయక్, ఐల వెంకన్న, శేఖర్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం పట్టనంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆ సంఘం నేతలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా బీసీ సామాజిక వర్గం అధికంగా ఉందని, బీసీలకు కాకుండా కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నుంచి కుందూరు రఘువీరారెడ్డి, భువనగిరి పార్లమెంటుకు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎంపిక చేసి బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, సంజీవ్, బ్రహ్మచారి, రవి, వంశీ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి



త్రిపురారంలోని కొదండ రామాలయంలో భజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సుధారాణి

త్రిపురారం : భక్తిభావంతోనే మానసిక ప్రశాంతత దొరుకుతుందని, ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని భజన సంకీర్తన రాష్ట్ర కార్యదర్శి సుధారాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అడవి దేవులపల్లి రోడ్డు వెంట త్రిపురారం గ్రామ పంచాయతీ సమీపంలో వెలసి ఉన్న కొదండ రామాలయంలో 24 భక్తి బృందాలు చేసే భజన సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడారు. మూడు రోజుల పాటు ఆలయంలో జరిగే భజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ మర్ల చంద్రా రెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాధారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, మార్తి భరత్ రెడ్డి, కరసేవకుడు కర్ర జానకిరాంరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



అప్సాను అభినందిస్తున్న కరస్పాండెంట్

హాలియా : సబ్ జూనియర్ బాలికల జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు హాలియా పట్టణంలోని వీఎస్ఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థినీ ఎండీ అప్సా ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ శివర్ల వెంకటయ్య, పీఈటీ పరమేష్ గురువారం తెలిపారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ బాలికల కబడ్డీ సెలక్షన్‌లో విద్యార్థినీ ఎండీ అప్సా పాల్గొని క్రీడల్లో చక్కటి ప్రతిభ కనబర్చి కబడ్డీ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరగబోయే 33వ సబ్ జూనియర్ బాలికల జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ అప్సాను కబడ్డీ కోచ్ ఎండీ అన్వర్‌ఖాన్, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడల్లో రాణించాలి

నల్లగొండ టూటౌన్ : క్రీడాకారులు తమకు నచ్చిన క్రీడల్లో రాణించి పేరు ప్రతిష్ఠలు పొందాలని టూటౌన్ సీఐ డానియెల్ అన్నారు. తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కలర్ బెల్టు ప్రమోషన్ టెస్టుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరంతర సాధన చేయడం ద్వారా పోటీల్లో గెలుపొందవచ్చన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చింత అనిల్‌కుమార్, కె.శ్రీకాంత్, పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



హాలియా :పేరూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో విద్యార్థులు



మిర్యాలగూడ : స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

హాలియా : అనుముల మండలంలోని పేరూర్ ప్రాథమిక పాఠశాల్లో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు కొల్లోజు సాయిశ్రీ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొమ్మరబోయిన స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్ వనజాకుమారి తదితరులు ఉన్నారు.

వర్డ్ అండ్ డీడ్ పాఠశాలలో..

మిర్యాలగూడ : పట్టణంలోని శాంతినగర్ కాలనీలోగల వర్డ్ అండ్ డీడ్ పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ కలీం మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపునకు మూడు రోజులే గడువు

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ఆస్తి పన్ను బకాయిదారులు వడ్డీపై 90శాతం రాయితీతో చెల్లించేందుకు మూడు రోజులే గడువు ఉందని, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ తెలిపారు. ముందస్తు నోటీసులు జారీ చేసిన ఎలాంటి స్పందన రాక పోవడంతో ఆస్తులకు తాళాలు వేశారు. ఆయన వెంట మున్సిపల్ రెవెన్యూ అధికారిని కళ్యాణి, ఆర్ఐలు రాకేష్, రవి, బిల్ కలెక్టర్లు యాదగిరి, ఖలీల్, బిక్షం , రమేష్, ఎల్లయ్య, సురేష్, సిబ్బంది సైదులు, శ్రీను తదితరులున్నారు.



తాళాలు వేయిస్తున్న కమిషనర్ యూసుఫ్

బాధిత కుటుంబాలకు పరామర్శ



మధు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన పోలేపల్లి గోపి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి గురువారం వారి నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. అలాగే అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మిర్యాలగూడ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కటికల మధును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు, నాయకులు కూన్‌రెడ్డి లింగారెడ్డి, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, సాయిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపెక్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని సెయింట్ జాన్స్ హై స్కూల్‌లో ఇటీవల హైదరాబాద్‌కు చెందిన అపెక్స్ ఒలింపియాడ్‌లో సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో 9తరగతి చదువుతున్న ఎ.శివకుమార్, ఎం. శివ ప్రసాద్, ఎస్‌లాస్య, ఆరోతరగతి చదువుతున్న పి. శివకుమార్, జి. మనిశ్వీనిలు గోల్డ్‌మెడల్‌ను సాధించగా 5వ తరగతి చదువుతున్న ఎస్. జీవనజ్యోతి, జి. సహర్ష్, ఈ. అనురాగ్, 4వ తరగతి చదువుతున్న డి. దీవేన, వి. కీర్తనలు సీల్వర్ మెడల్స్‌లను సాధించారు. మరో 90 మంది విద్యార్థుకు సర్టిఫికేట్లను అందజేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్లు అభినందించారు. అదే విధంగా పాఠశాల అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

‘త్వరలో నిర్ణయాన్ని ప్రకటిస్తా

నల్లగొండ: రెండు, మూడు రోజుల్లో రాజకీయ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ తెలిపారు. గురువారం నల్లగొండలో నిర్వహించిన కార్యకర్తలతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యకర్తల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తల నిర్ణయం మేరకే భవిష్యత్ నిర్ణయం తీసుకుంటానని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనతోపాటు పనిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రచయిత రఘువీర్ ప్రతాప్‌కు సన్మానం



ప్రతాప్‌ను సన్మానిస్తున్న సిలువేరు సాహితి సేవా కళా పీఠం సభ్యులు

నల్లగొండ: రచయిత రఘువీర్ ప్రతాప్‌ను నల్లగొండలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ విరామ సమయంలో గురువారం సిలువేరు సాహితి సేవా కళా పీఠం ఆధ్వర్యంలో డీఐఈఓ దస్రూనాయక్ సన్మానించారు. రఘువీర్‌ను పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఇటీవల కీర్తి పురస్కారంతో సన్మానించింది. పురస్కారం దక్కిన సందర్భంగా రఘువీర్‌ను సన్మానించినట్లు సిలివేరు సాహితి కళాపీఠం అధ్యక్షుడు సిలువేరు లింగమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, భానునాయక్, నరేంద్ర, సింగం శ్రీనివాస్, నరసింహ, తాటిసెట్టి హేమ్లానాయక్, భద్రయ్య, కళా పీఠం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.